వాక్యానుసారం సంవత్సరం వసంతంతో ప్రారంభమవుతుందని, ఆ వసంత రుతువులో మధు, మాధవ మాసాలున్నాయని వివరణ.

ఉగాది– వసంతానికి గల అవినాభావ సంబంధం, సూర్యునికి సకల రుతువులకు ప్రాతఃస్సాయంకాలాది త్రికాలాలో ఉషా దేవత మా తృస్వరూపమని వివరిస్తున్న సూర్యరశ్మికున్న ప్రయోజనాన్ని అంగ పురాణం చెపుతోంది.

సూర్య కిరణాల ప్రభావంతో వివిధ రుతువులలో ప్రకృతి ఒక్కొక్క రకంగా స్పందిస్తుంది. గ్రీష్మ రుతువులో అధిక వేడి, వర్ష రుతువులో వర్షాల వల్ల కర్షకులు కృషీవలుర వుతారు. భూభాగం ఒత్తిడిగా మారి అంటురోగాలకు అవకాశం ఉంది. శరత్, హేమంతాల వెన్నెలను, చలిని కలిగిస్తాయి. ప్రేమికులకు విరహాన్ని కలుగ చేసి ఎండమావి వలె ఆశలు రేకెత్తించి వెళ్ళిపోతుంది. రాజులు ఈ కాలాన్ని యుద్ధానికి వాడుకునేవారు. శిశిరంలో ప్రకృతి బోసిపోయినట్లుగా ఆకులన్నీ రాలి మోడులు మిగులుతాయి.

ఇక సూర్యకిరణ ప్రభావితమైన వసంతం పసుపు, గోధుమ వర్ణంలో ఉంటుంది. ఈ కిరణాలు ఉత్తరాయణంలో వికాసం చెందుతాయి. దక్షిణాయణంలో క్షీణత చెందుతాయి. వసంతానికి ఇతిహాసపరంగా, వైద్య పరంగా, శోభ పరంగా ఎంతో ప్రాముఖ్యత ఉంది. వసంతాన్ని రుతురాణిగా అభివర్ణించారు. 'మామిడి పిందెలతో నిండిన చెట్లు, వేప పూతతో విరబూసిన వృక్షాలు, కోకిలమ్మల కూజితాలు ఈ పండుగ ప్రత్యేకం. చెట్లన్నీ ఆకులు రాల్చి, చిగుర్చి కళకళలాడుతూ ఉంటాయి. శిశిరంలో ఎండి మోడువారిన చెట్లన్నీ వసంత రుతువు ఆగమనంలో సన్న జాజుల, మల్లెల పరిమళాలతో ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. అంతటి ప్రకృతి శోభను సంతరించుకుంటుందన్న మాట. మానవులు అనేక రుగ్మతలతో బాధలతో కృశించే సమయంలో వినూత్న మార్పుల్ని, జాగృతినీ కలిగిస్తుంది వసంత ఆగమనం.

వసంతాగమనంతో పసిపిల్లవాని నవ్వు లాగా ప్రకృతిలో నూతనోత్తేజం కలుగుతుంది. వృక్షాలు నూతనమైన పల్లవాలతో కూడిని హాయిని, ఆనందాన్ని కలిగిస్తాయి. అందరికీ వసంతాగమనం శుభసూచకంగా, నూతన ఆశయాలకు స్ఫోరకంగా, ప్రకృతికి, మానసిక స్థితులకు హేతువుగా సంవత్సర ప్రారంభ రుతువుగా మలచడం జరిగింది. ఈ సమస్త సృష్టి అనే యజ్ఞాగ్నిని ప్రేరేపించే ఆజ్యం వసంతం. గ్రీష్మం సమిధ, శరత్తు హవిస్సు. ఈ విధమైన సృష్టి యజ్ఞ సుసంపన్నతకు కారణమైన వసంతం ప్రథమ రుతువై సంవత్సరానికి మొదలు అయ్యింది. వసంతానికి వసువులు అధి దేవతలు. ప్రకృతి చిగురించడానికి, మనస్సులో నూతనమైన ఆలోచనలు రేకెత్తించడానికి కారణమైనవే ఈ వసువులు. ఈ వసువులు అధిదేవతలుగా ఉన్న వసంతం సంవత్సరారంభ రుతువైనది. 'రుతూనాం కుసుమాకరం' అని గీతలో శ్రీకృష్ణుడు వసంత ప్రాధాన్యాన్ని వివరించాడు.

భాస్కరాచార్యుడు తన 'సిద్ధాంత శిరోమణి'



అనే జ్యోతిష గ్రంథంలో లంకా నగరంలో సూర్యుడు ఉదయించడం వల్ల మధుమాసం 'యుగాది' అయ్యింది. రావణాసుర వధ అనంతరం శ్రీరాముడు సీతతో కూడి అయోధ్యకు ఈ ఉగాది రోజునే బయలుదేరినట్టు వివరణ ఉంది. వసురాజు తీవ్రమైన తపస్సు చేసి రాజ్యాన్ని పొందినపుడు ఇంద్రుడు అతనికి నూతన వస్త్రాలు బహూకరించింది ఉగాది నాడే. వేదాలను దొంగలించిన సోమకుని



వధించిన మత్స్యావతార ధారియై వేదాలు బ్రహ్మకు అప్పగించింది ఉగాది నాడే.

వైద్యపరంగా వసంతం: వసంతంలో వేసవి తాపం ఎక్కువగా ఉంటుంది. ఏ మాలిన్యమూ లేని వేడినీటిలో రోజుకు ఐదుసార్లు స్నానం చేస్తే ఈ వేసవి రోగాలు దరిచేరవుట. వసంత నవరాత్రులు ఆరోగ్యరీత్యా కూడా శుభకరమైన రోజులు. 'ఆనంద సాగరమనే వైద్య శాస్త్ర గ్రంథం'లో వసంత రుతువులో కోకిల కంఠస్వరం వింటే కొన్ని రకాలైన రుగ్మతలు తొలిగిపోతాయని పేర్కొన్నారు. శుశ్రుత వైద్య గ్రంథంలో, వసంతరుతువులో వేప పువ్వు తగు మోతాదులో తీసుకుంటే క్షయరోగాన్ని అరికట్టవచ్చని చెప్పబడింది. ప్రపంచంలో ఎక్కువ పుష్పాలు వికసించేది వసంతంలోనే ఈ పుష్ప సుగంధాలు ప్రకృతికి ఉన్న అమృతత్వాన్ని ఎక్కువ చేసి ఎన్నో రోగాలు తగ్గేందుకు తోడ్పడుతుంది.

ప్రతి వసంతం మనకు ప్రకృతి సోయగాల్ని స్ఫురణకు తెస్తుంది. మానవ జాతే కాదు.. పక్షులు, కీటకాలు సంబరంగా జరుపుకునే పండుగ వసంతాన విరిసే ఉగాది. ఉగాది పండుగలోని సోయగాన్ని అనుభవించడంతో పాటు కొత్త ఉషస్సునూ స్వాగతించాలి. ప్రకృతి అంతా పాత ఆకులు రాల్చి కొత్త అందాల్ని నింపుకున్నట్లే మనలోని చెడుని విసర్జించి మంచికి స్వాగతం పలకాలి. ఈ వసంతరుతువలో పునఃసృష్టి ఆరంభమవుతుంది. వసంత ఆరంభాన్ని సృష్టికి ఆరంభంగా భావించాలి. జీవితంలో విలువల్ని పునఃప్రతిష్ఠ చేయడం కోసం అవతరించిన శ్రీరామచంద్రుడు తన అవతరణకు చైత్ర మాసాన్ని ఎంచుకున్నాడు. వసంతం మాధవ తత్వానికి ప్రతీక. సౌందర్యానికి చిహ్నం.

ఏ ప్రాంతీయులు ఏ పేరు పెట్టుకున్నా 'వసంతలక్ష్మి'కి స్వాగత సత్కారమే ఈ ఉగాది.

---

మీ సందేహాలని క్లుప్తంగా (మనిషికి 1 ప్రశ్న మాత్రమే) ఈ క్రింది వివరాలు వ్రాసి పంపండి. (పుట్టిన తేదీ వివరాలు లేనివారు 108 లోగా ఒక సంఖ్య వ్రాసి పంపండి. ఇది ప్రశ్న పద్ధతి, మనిషికి ఒక్క ప్రశ్న మాత్రమే)

పేరు : ............................ పుట్టిన తేదీ : ............................

పుట్టిన సమయం : ...................... పుట్టిన వూరు (మండలం) : ............

ప్రశ్న : ............................

పై వివరాలతో కూడిన లెటర్‌ను ఈ క్రింది అడ్రస్‌కు పంపండి...

'భవిత' 'సూర్య' ఆదివారం సూర్యసౌధ, ప్లాట్ నెం: 22, రోడ్ నెంబర్: 5, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33, ఫ్యాక్స్: 040 2360 0024. sunday@suryaa.com